సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 15 । జూలై । 2023



కత్తిపోట్ల ఘటనలో..

భీమవరం వన్‌టౌన్‌లో కత్తిపోట్ల ఘటనలో వ్యక్తి మృతి చెందిన కేసుకు సంబంధించి నలుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ అడబాల శ్రీను శుక్రవారం తెలిపారు. 8లో ▸



ఆపద వేళ.. ప్రాణాలకు తెగించి..

గోదావరి పరివాహక ప్రాంతాలను వరదలు చుట్టిముట్టిన సమయంలో మేమున్నామంటూ గ్రామ వలంటీర్లు ప్రాణాలకు తెగించి విశేష సేవలందించారు. 8లో ▸

అమ్మతనానికి మాయని మచ్చ

ఏలూరు జిల్లా పెదపాడు మండలంలో సభ్యసమాజం సిగ్గుపడేలా.. అమ్మతనానికి మాయని మచ్చతెచ్చేలా ఓ తల్లి చేసిన నిర్వాకం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 8లో



న్యూస్‌రీల్

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం



స్పిల్ గేట్ల ద్వారా దిగువకు చేరుతున్న నీరు

పోలవరం రూరల్: గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. నదీ పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షంనీరు గోదావరిలోకి చేరడంతో ప్రవాహం కూడా పెరిగింది. ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 27 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్ గేట్ల ద్వారా నీరు స్పిల్ ఛానల్ మీదుగా దిగువన సహజ ప్రవాహంలో కలుస్తోంది.

17న హ్యాండ్‌బాల్ సెలెక్షన్స్

ఏలూరు రూరల్: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఈనెల 17న హ్యాండ్‌బాల్ అకాడమీ బాలుర ఎంపిక పోటీలు నిర్వహించనుందని ఏలూరు జిల్లా చీఫ్‌కోచ్ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. తెనాలి మిటీ స్టేడియంలో ఉదయం 8 గంటలకు రాష్ట్రస్థాయిలో సెలెక్షన్స్ చేపడతారని, 14–18 ఏళ్ల వయసున్న క్రీడాకారులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల మెరిట్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, పుట్టినతేదీ ధ్రువీకరణతో పాటు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9866317326 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'గురుకుల' సీట్లు నిండినవి

నరసాపురం రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని గురుకుల విద్యాలయాల సంస్థ నడుపుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సీట్లు నిండాయని జిల్లా కో–ఆర్డినేటర్ నంబూరి భారతి ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకుల విద్యాలయాల్లో చేర్పించేందుకు సిఫార్సు లేఖలతో వస్తున్న నేపథ్యంలో ప్రకటన విడుదల చేశామని పేర్కొన్నారు. 5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు సంబంధించి 2023–24 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు పూర్తిస్థాయిలో నిండాయని, అలాగే 6 నుంచి 9వ తరగతి వరకూ కూడా ఎటువంటి ఖాళీలు లేవని తెలిపారు.

'పద్మ' అవార్డుల అర్హుల జాబితా అందించండి

ఏలూరు(మెట్రో): భారత ప్రభుత్వం అందించే 'పద్మ' పురస్కారాలకు ఏలూరు జిల్లాలో అర్హులైన వారి వివరాలు వచ్చేనెల 10లోగా అందించాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి అధికారులను ఆదేశించారు. ఏలూరు కలెక్టరేట్‌లో శుక్రవారం పద్మ పురస్కారాలపై ఆమె సమీక్షించారు. కళలు, భాషా సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సమాజ సేవ, శాస్త్ర సాంకేతికత, ప్రజావ్యవహారాలు, పౌర సేవలు, పరిశ్రమలు మొదలైన రంగాల్లో నిష్ణాతులు, విశిష్ట సేవలందించిన వారికి భారత ప్రభుత్వం ఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా పద్మ పురస్కారాలను అందిస్తుందన్నారు.

రక్త నిర్ధారణ ఇక సులభం

వేగంగా.. కచ్చితంగా..

- రక్త పరీక్షలకు అధునాతన యంత్రాలు
- ప్రభుత్వాస్పత్రుల్లో ఏర్పాటు
- 640 రకాల వైద్య పరీక్షలు
- ఒక్కో మెషీన్‌కు రూ.20 లక్షల వ్యయం



భీమవరం ఏరియా ఆస్పత్రిలో ఆధునిక యంత్రం, రక్త పరీక్షల తీరును పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ వీరాస్వామి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజారోగ్యమే పరమావధిగా సేవలందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలు మార్చడంతో పాటు ఆధునిక యంత్రాలను సమకూర్చుతోంది. ప్రభుత్వాస్పత్రుల భవనాలను ఆధునికీకరించడంతో పాటు అన్నిరకాల మౌలిక వసతులను కల్పిస్తోంది. అలాగే అధునాతన పరికరాలు, మెషీన్లను అందుబాటులోకి తీసుకువస్తోంది. దీంతో రక్త, వైద్య పరీక్షల ఫలితాలు వేగంగా, కచ్చితంగా వచ్చేలా చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా ఫుల్లీ ఆటోమెటిక్ ఎనలైజర్ ఎక్సెల్–640 యంత్రాలను ప్రభుత్వాస్పత్రుల్లో ఏర్పాటుచేస్తోంది. రూ.20 లక్షల విలువైన ఈ మెషీన్ ద్వారా 640 రకాల రక్త, ఇతర పరీక్షలను చేయవచ్చు. పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం ఆస్పత్రుల్లో, ఏలూరు జిల్లాలోని ఏలూరులోని సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్), నూజివీడు ఏరియా ఆస్పత్రుల్లో వీటిని ఏర్పాటుచేశారు.

ఖర్చు లేకుండా ఖరీదైన పరీక్షలు

ప్రభుత్వాస్పత్రులకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు రక్త పరీక్షలను ఈ మెషీన్ ద్వారా ఉచితంగా చేస్తున్నారు. దీంతో ముఖ్యంగా గర్భిణులకు చాలా మేలు జరుగుతోంది. గర్భిణులకు అన్నిరకాల పరీక్షలు ప్రైవేట్ ల్యాబ్‌లో చేయాలంటే రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఖర్చవుతుంది. ఇలాంటి ఖరీదైన పరీక్షలను సైతం ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా చేస్తున్నారు. ఇది పేద రోగులకు ఊరట కలిగిస్తోంది.

రోజుకు వెయ్యి మంది వరకూ..

పశ్చిమగోదావరి జిల్లాలోని నాలుగు ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్కోచోట రోజుకు 500 నుంచి 1,000 మంది వరకు రక్తపరీక్షలు చేయించుకుంటున్నారు. ఆయా ఆస్పత్రుల్లో ఓపీని బట్టి పరీక్షలు ఉంటున్నాయి. రోజుకు భీమవరంలో 500 మంది, తణుకులో 1,000 మంది, తాడేపల్లిగూడెంలో 800 మంది, నరసాపురంలో 400 మంది రక్త పరీక్షలను వైద్య సిబ్బంది చేస్తున్నారు.

ఏఏ రకాల పరీక్షలంటే..

ఫుల్లీ ఆటోమెటిక్ ఎనలైజర్ ఎక్సెల్–640 మెషీన్ ద్వారా కిడ్నీ, లివర్, షుగర్, ఫీవర్, హెచ్‌బీ, సోడియం, పొటాషియం, కాల్షియం, కొలెస్ట్రాల్, ప్లేట్‌లెట్స్ తదితర రక్తపరీక్షలు చేస్తున్నారు.

గతంలో ప్రైవేట్ ల్యాబ్‌ల్లోనే..

గత టీడీపీ పాలనలో ప్రభుత్వాస్పత్రుల్లో ల్యాబ్‌ల నిర్వహణ అధ్వానంగా ఉండేది. దీంతో ఆస్పత్రులకు వచ్చే గర్భిణులు, రోగులు రక్తపరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం ఇటువంటి ఇబ్బందులేవీ లేకుండానే ప్రభుత్వాస్పత్రుల్లో ఆధునిక యంత్రాల ద్వారా ఉచితంగా రక్త పరీక్షలు చేస్తున్నారు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

సద్వినియోగం చేసుకోవాలి

పశ్చిమగోదావరి జిల్లాలోని నాలుగు ఆస్పత్రుల్లో ఎక్సెల్–640 మెషీన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చాం. ఈ మెషీన్ కచ్చితమైన ఫలితాలు ఇస్తుంది. ఆస్పత్రులకు వచ్చే వారిలో రక్త పరీక్షలు అవసరమైన వారు, గర్భిణులు ఈ మెషీన్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ ఎం.వీరాస్వామి, డీసీహెచ్‌ఎస్, భీమవరం

ఉచితంగానే పరీక్షలు



నాకు భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల రక్త పరీక్షలను ఉచితంగా చేశారు. అదే ప్రైవేట్ ల్యాబ్‌ల్లో రక్త పరీక్షలు చేయించుకుంటే నాకు రూ.3 వేల వరకు ఖర్చయ్యేది. ముఖ్యమంత్రి జగనన్న అన్నిరకాల వైద్య పరీక్షలు ఆస్పత్రిలో చేసేలా సౌకర్యాలు కల్పించడం చాలా సంతోషంగా ఉంది.

– బి.దుర్గ, గర్భిణి, మైప వడ్డిగూడెం

గొప్ప విషయం



భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో నా భార్యకు రక్త పరీక్షలను నూతన టెక్నాలజీ గల మెషీన్ ద్వారా చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఖరీదైన మెషీన్ ద్వారా పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు చేసేలా ఉచితంగా రక్త పరీక్షలు చేయడం గొప్ప విషయంగా భావిస్తున్నాను. ఇది పేదలకు మేలు చేస్తుంది.

– దాసరి హరికృష్ణ, సీసలి

విద్యార్థుల సంరక్షణే ధ్యేయంగా..

అధికారుల వసతిగృహాల సందర్శన, రాత్రి బస



ఏలూరు వసతిగృహాన్ని పరిశీలించి అక్కడే బస చేస్తున్న డీపీఓ విశ్వనాథ్

ఏలూరు(మెట్రో): విద్యార్థుల సంరక్షణే ధ్యేయంగా వసతి గృహాలు, పాఠశాలల్లో వసతులు సమకూర్చుతూ వారి విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. దీనిలో భాగంగా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత వంటి అంశాలపై దృష్టి సారించారు. ఇటీవల ఏజెన్సీలో జరిగిన విద్యార్థి హత్య ఘటనను దృష్టిలో ఉంచుకుని ప్రతి అధికారి తప్పనిసరిగా హాస్టళ్లు, విద్యాసంస్థలను సందర్శించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతను సైతం గుర్తిస్తూ విద్యార్థులకు వసతులు స్వయంగా పరిశీలించి రాత్రుళ్లు సైతం విద్యార్థులతోనే అధికారులు నిద్రించాలని ఆదేశించారు. దీంతో జిల్లాలోని ప్రతి వసతిగృహాన్ని మండల పరిషత్ అధికారులు, తహసీల్దార్లు, జిల్లా స్థాయి అధికారులు శుక్రవారం రాత్రి సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, వారి స్థితిగతులపై ఆరా తీసి హాస్టళ్లలోనే అధికారులు నిద్రకు ఉపక్రమించారు.

సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యం

కలెక్టర్ ప్రశాంతి



భీమవరంలో బియ్యం స్టోర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యాన్ని అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం భీమవరం రైతుబజార్‌లో ప్రభుత్వ నిర్దేశిత ధరలకు బియ్యం అమ్మకాల స్టోర్‌ను జేసీ రామసుందర్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించేందుకు సివిల్ సప్లయ్ అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్, హోల్‌సేల్ బియ్యం వ్యాపారుల సమన్వయంతో బియ్యం అమ్మకాలు ప్రారంభించారన్నారు. భీమవరంలో తొలిస్టోర్ ప్రారంభించామన్నారు. కిలో సాధారణ రకం రూ.34, ఫైన్ రకం రూ.40, సూపర్ ఫైన్ రకం రూ.46కు విక్రయిస్తారన్నారు. ఇక్కడ కంది పప్పు కూడా విక్రయిస్తారన్నారు. జేసీ రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ శనివారం తణుకు, తాడేపల్లిగూడెం, ఆకివీడులో బియ్యం స్టోర్‌లను ప్రా రంభిస్తామన్నారు. జిల్లాలో పది మండలాల్లో స్టోర్ల ఏర్పాటుకు నిర్ణయించామన్నారు. పలమనేరు నుంచి టమాటాలను తెప్పించి రైతుబజార్ల ద్వారా సబ్సిడీపై విక్రయిస్తున్నామన్నారు. మార్కెట్‌లో పెరిగిన ధరలకు ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నామన్నారు. సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, డీఎస్ ఓ ఎస్.సరోజ, మెప్మా పీడీ గ్రంధి పార్వతి, ఉద్యాన ఏడీ దుర్గేష్, మార్కెటింగ్ ఏడీ కె.సునీల్‌కుమార్, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి.కల్యాణ్, రైస్ ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజసుధాకర్ రావు పాల్గొన్నారు.

లక్ష్యాలను అధిగమించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో అధిగమించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రీ సర్వే, వాటరు ట్యాక్స్, స్పందన పిటిషన్లు, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు, మౌలిక వసతులు, భూ సేకరణ, టూరిజం ప్రాజెక్టులు, ఎన్నికలు, సీసీఆర్‌సీ కార్డులు తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డితో కలిసి ఆమె సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమం బాగా జరుగుతుందని, మరిన్ని సర్వీసులు పెంచాలన్నారు. మరణించిన వారి ఓట్లను తొలగించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఓటర్ల నమోదులో అలసత్వం వద్దని, దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్‌గా ఉందన్నారు. తణుకు మండలం ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు నమోదు చేసుకున్నారని, మిగతా మండలాల్లో ఎందుకు నమోదు చేయలేదని నెలాఖరుకు నూరు శాతం నమోదు పూర్తిచేయాలన్నారు. స్పందనలో వచ్చిన ప్రతి ఫిర్యాదుకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. లేఅవుట్లకు సంబంధించి కోర్టు కేసులు ఉంటే త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. ఆచంట, పెనుగొండ, యలమంచిలి మండలాల్లో లంక భూముల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సాంకేతిక ఇబ్బందులు సాకుగా చూపుతూ కాలయాపన చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్లు, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ చిప్ కరప్ట్ అయ్యింది!

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



రామన్నగూడెంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో వలంటరీ, సచివాలయ వ్యవస్థ ద్వారా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్ చిప్ కరప్ట్ అయినట్లు ఉందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. శుక్రవారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం రామన్నగూడెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో సమితులు ఉండేవని, తదుపరి ఎన్టీఆర్ మండల వ్యవస్థను తీసుకొచ్చారని గుర్తుచేశారు. సీఎం జగన్ మరో ముందడుగు వేసి సచివాలయ, వలంటరీ వ్యవస్థలను తీసుకువచ్చి పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నారన్నారు. ఇటీవల పవన్ కళ్యాణ్ నిర్వహించిన సమావేశంలో సచివాలయ, వలంటరీ, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్‌లు అవసరమా? పరిపాలనలో మార్పు చేయాల్సిన అవసరం ఏముందని కార్యకర్తలకు హితబోధ చేస్తున్నారన్నారు. వ్యవస్థపై కనీస అవగాహన లేకుండా పవన్‌కళ్యాణ్ అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని మంత్రి కొట్టు విమర్శించారు. మండల వ్యవస్థను తీసుకొచ్చిన ఎన్టీఆర్ పేరును పూర్తిస్థాయిలో మరుగున పెట్టే కుట్రలో భాగంగానే పవన్ కళ్యాణ్ నోట చంద్రబాబు ఆ మాటలు పలికించి ఉండవచ్చని అన్నారు. అవగాహన లేని విషయాల్లో ఎందుకు వేలు పెడుతున్నావని పవన్‌ను నిలదీశారు. చంద్రబాబు మాదిరిగా పవన్ భ్రమలో ఉన్నాడన్నారు. ప్రజలు పవన్‌ను ఛీకొడితే ప్రధాన ప్రతిపక్ష హోదా నిలబెట్టుకోవాలనే దుర్మార్గపు ఆలోచన చంద్రబాబు చేసి ఉండవచ్చన్నారు. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థలో వేలు పెట్టి చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా పవన్ కళ్యాణ్ పరిస్థితి ఉందన్నారు. ఆదిమానవుని ఆలోచనలు ఆయన మానసిక పరివర్తనకు నిదర్శనంగా నిలుస్తున్నాయని మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు.

వరద సహాయ చర్యలకు సన్నద్ధం

- పక్కాగా ముందస్తు ఏర్పాట్లు
- డిపోల్లో బియ్యం నిల్వలు
- అందుబాటులో మరబోట్లు, లాంచీలు
- ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం



వరద బాధితులను తరలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం (ఫైల్)

బుట్టాయగూడెం: గోదావరికి వరద పెరిగే అవకాశమున్నందున సమాచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వరద సహాయక చర్యలకు పక్కా ఏర్పాట్లు చేశారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో తాలిపేరు వద్ద వరద నీరు చేరడంతో గేట్లు ఎత్తి కిందకు వదిలారు. దీంతో భద్రాచలం వద్ద వరద నీరు వచ్చి చేరుతోంది. గత అనుభవాల దృష్ట్యా ఈ ఏడాది గోదావరి వరద కష్టాల నుంచి ముంపు గ్రామాల బాధితులను గట్టెక్కించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ జిల్లా అధికారులను అప్రమత్తం చేసి ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించి సహాయ చర్యలపై సమీక్షించారు. ముంపుకు గురయ్యే గ్రామాల ప్రజలకు అవసరమయ్యే నిత్యావసర సరుకులను సమకూర్చి ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యలు అందించేలా ఏర్పాట్లు చేశారు.

726 క్వింటాళ్ల బియ్యం

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ప్రజలకు నిత్యావసర వస్తువులను సకాలంలో అందించేలా అధికారులు ఇప్పటికే ఏర్పాట్లుచేశారు. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులను డిపోల్లో సిద్ధం చేస్తున్నారు. కుక్కునూరు మండలంలో 465.310 క్వింటాళ్లు, వేలేరుపాడు మండలంలో 260.780 క్వింటాళ్ల బియ్యాన్ని వరద బాధితులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు.

సమాచార సేకరణకు శాటిలైట్ ఫోన్లు

వరదల సమయంలో సమాచార సేకరణ కోసం అధికారులు శాటిలైట్ ఫోన్లు సిద్ధం చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో తహసీల్దార్ల వద్ద ఉంచి వీటి నుంచి సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి ఉన్నతాధికారులకు అందించేలా ఏర్పాట్లుచేశారు. అలాగే లాంచీలు, మరబోట్లు, జనరేటర్లు కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.

సేవా వలంటీర్లు

నాడు వరద సహాయక చర్యల్లో గ్రామ వలంటీర్లు సేవల్లో ముందంజలో ఉన్నారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని వలంటీర్లు చురుగ్గా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. పునరావాస శిబిరాల్లో వరద బాధితులకు నిత్యావసర సరుకులు, భోజన ఏర్పాట్లలో సాయపడ్డారు. ప్రభుత్వం ప్రకటించిన ఇళ్ల నష్టపరిహారం అందించడంలోనూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇదే మాదిరి ఈ ఏడాది కూడా సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామని వలంటీర్లు అంటున్నారు.

19 వేల కుటుంబాలకు నిత్యావసరాలు

గతేడాది ముంపు ప్రాంతాల్లోని సుమారు 19 వేల కుటుంబాలకు పైగా నిత్యావసర సరుకులను ప్రభుత్వం అందించింది. 24 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి 6,514 కుటుంబాలకు చెందిన 19,631 మందికి ఆశ్రయం కల్పించారు. 4,500 టార్పాలిన్స్, 13 వేల కొవ్వొత్తులు, 500 దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే కుటుంబానికి 25 కిలోల బియ్యం చొప్పున 5.08 లక్షల కిలోలు, కిలో కందిపప్పు చొప్పున 20,402 కిలోలు, 20 వేల కిలోల పామాయిల్, 35 వేల లీటర్ల పాలు, కూరగాయల కిట్లు అందజేశారు. వరద పునరావాసం సహాయం కింద 7,700 కుటుంబాలకు సుమారు రూ.1.45 కోట్ల ఆర్థిక సాయం అందించారు. వరద సహాయక చర్యల్లో రెండు హెలికాఫ్టర్లు కూడా సేవలందించాయి. ఇదే మాదిరిగా సేవలందించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది.

గతేడాది సేవలు భేష్



వరద బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ (ఫైల్)

గతేడాది గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో కుక్కనూరు, వేలేరుపాడు మండలాల్లో 90 గ్రామాలు నీటమునిగాయి. ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఆ సమయంలో సీఎం జగన్ నిత్యం కలెక్టర్‌తో మాట్లాడి సహాయక చర్యలపై దిశానిర్దేశం చేశారు. యుద్ధప్రాతిపదికన పునరావాస, సహాయక చర్యలు చేపట్టారు. దీంతో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, అప్పటి జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ నేతృత్వంలో పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్, పంచాయతీరాజ్, పౌరసరఫరాల శాఖ, డీఆర్‌డీఏ, జిల్లాపరిషత్, గ్రామ సచివాలయాలు, ఏలూరు కార్పొరేషన్‌తో పాటు అన్ని శాఖల ఉన్నతాధికారుల నుంచి కింద స్థాయి అధికారుల వరకు ముంపులోనే మకాం వేసి సేవలందించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్ బృందాలు సైతం ఉత్తమ సేవలందించాయి.

వీఆర్‌కు ఏలూరు త్రీటౌన్ సీఐ వరప్రసాద్

ఏలూరు టౌన్: ఏలూరు త్రీటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కోమాకుల శివాజీని నియమిస్తూ డీఐజీ జీవీవీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. కృష్ణా జిల్లాలో పనిచేస్తున్న సీఐ శివాజీని ఏలూరు రేంజ్‌కు తిరిగి మార్పు చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం త్రీటౌన్ సీఐగా పనిచేస్తున్న కేవీఎస్ వరప్రసాద్‌ను రేంజ్ వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఏలూరు త్రీటౌన్ పరి దిలో పలు సంచలన సంఘటనలు చోటుచేసుకోవడం, ఇతర కారణాలతో ఆయన్ను వీఆర్‌కు పంపినట్టు తెలిసింది. సీఐ శివాజీ శనివారం బాధ్యతలు స్వీకరించవచ్చని సమాచారం.

సాయిబాబా గుడిలో చోరీ

ఏలూరు టౌన్ : ఏలూరు ఆదివారపుపేటలోని సాయిబాబా ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ పూజారి గంగాధరరావు గురువారం రాత్రి గుడి తలుపులకు తాళాలు వేసి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చి చూడగా తాళాలతో పాటు గుడిలో హుండీ పగులకొట్టి ఉండటాన్ని పూజారి గమనించారు. హుండీని పరిశీలించగా నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్టు గుర్తించారు. పూజారి గంగాధరరావు ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

పురుగు మందుల దుకాణంపై విజిలెన్స్ దాడి



ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంలోని పురుగు మందుల దుకాణంలో ఎరువుల స్టాకు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెంలో లక్ష్మీ ట్రేడర్స్ పురుగు మందుల దుకాణంపై రీజనల్ ఎన్ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో ఎరువుల గోదాంలో ఉండాల్సిన స్టాకు కంటే తక్కువ ఉన్నట్టు గుర్తించారు. దాంతో రూ. 1,27,400 విలువైన ఎరువులను సీజ్ చేసి, 6ఎ కింద కేసు నమోదు చేశారు. ఎరువులు, పురుగు మందుల డీలర్లు ఎవరైనా నిషేధిత గ్లైసిల్ కలుపు ముందు అమ్మకాలు జరిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్ కుమార్ హెచ్చరించారు.

అసభ్యంగా ప్రవర్తించాడంటూ ఫిర్యాదు

పెదపాడు: నిద్రిస్తున్న మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసారు. గురువారం రాత్రి 1.30 గంటల సమయంలో ఏపూరుకు చెందిన దుడ్డు బుజ్జి తన కుటుంబసభ్యులతో కలిసి నిద్రిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన బొబ్బిలి రాజా మద్యం మత్తులో ఇంట్లోకి ప్రవేశించి అసభ్యకరంగా ప్రవర్తించాడని.. కేకలు వేయడంతో పారిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆపద వేళ.. ప్రాణాలకు తెగించి..

వలంటీర్లకు వందనం

- గతేడాది ఎన్నడూలేని స్థాయిలో ముంచెత్తిన గోదావరి వరద
- ఉమ్మడి పశ్చిమగోదావరిలో వేల సంఖ్యలో బాధితులు
- తామున్నామంటూ సాయమందించిన వలంటీర్లు
- వందల సంఖ్యలో తరలివచ్చి ముంపు ప్రాంతాల్లో సేవలు
- ఏలూరు జిల్లాలో 508 మంది, పశ్చిమ గోదావరిలో 135 మంది వలంటీర్ల సేవలు
- నేటికీ వారి సేవలను గుర్తుచేసుకుంటున్న బాధితులు

గోదావరికి వరదలు వస్తున్నాయంటే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు వణికిపోతారు. వరదల ప్రభావంతో ఇళ్లన్నీ నీటమునగడం, జనావాసాలు నీళ్లలో నానుతుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో బాధితులు పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటారు. ఆస్తినష్టంతో ప్రాణనష్టం కూడా జరిగే పరిస్థితులు నెలకొంటాయి. ఆ సమయంలో వారికి ప్రభుత్వం తరపున తమ సేవలందిస్తూ ఆదుకుంటున్నది అధికారులు, గ్రామ వలంటీర్లే.



యలమంచిలి మండలం యలమంచిలిలంక గ్రామంలో వరద బాధితులకు పడవపై ఆహారం తీసుకెళ్లి అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)



యలమంచిలి మండలం శిరగాలపల్లి పునరావాస కేంద్రం వద్ద ఆహార పొట్లాలు ప్యాక్ చేస్తున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది (ఫైల్)

సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్ : గోదావరికి 2022 సంవత్సరంలో వచ్చిన వరద బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. ఏలూరు జిల్లా పరిధిలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు ఎక్కువగా వరద ప్రభావానికి గురయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఆచంట, పెనుగొండ, యలమంచిలి, నరసాపురం మండలాలు వరద తీవ్రతను చవిచూశాయి. వేలాదిమంది ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వందల మంది పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. ఇక ఆచంట మండల పరిధిలోని లంక గ్రామాల పరిస్థితి వర్ణనాతీతం. వరదల వేళ అవి దీవులుగా మారిపోయాయి. వరదల వేళ ఆ గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఆ కష్టకాలంలో తామున్నామంటూ సేవలందించేందుకు ముందుకొచ్చారు గ్రామ వలంటీర్లు.

బాధితుల సేవలో వందలాదిమంది వలంటీర్లు...

గతేడాది గోదావరి వరదలు సృష్టించిన బీభత్సాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు ఎన్నటికీ మరిచిపోలేరు. అదే క్రమంలో అధికారులు, వలంటీర్లు అందించిన సేవలను కూడా వారు ఎప్పటికీ మరువరంటే అతిశయోక్తి కాదు. ప్రభుత్వం వరదల తీవ్రతను ముందే అంచనా వేసి.. ముందస్తు చర్యలు చేపట్టడంతో ఒక్క ప్రాణనష్టం లేకుండా విపత్తును ఎదుర్కోవడం గమనార్హం. ప్రభుత్వ సూచనలతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏలూరు జిల్లా నుంచి 508 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా సేవలందించారు. ముంపు ప్రాంతాల్లో 10 రోజులపాటు అందుబాటులో ఉన్నారు. బాధితులకు ప్రభుత్వం సరఫరా చేసిన తాగునీరు, ఆహారం, నిత్యావసరాలు అందజేశారు.

ప్రాణాలకు తెగించి.. పడవలపై వెళ్లి..

పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని ఆచంట, పెనుగొండ, యలమంచిలి, నరసాపురం మండలాల పరిధిలో 19 గ్రామాలు వరద ప్రభావానికి గురయ్యాయి. అధికారులతో పాటు ఆయా గ్రామాల్లో పనిచేసే 135 మంది వలంటీర్లు, 75 మంది ఆపద మిత్రులు విశేష సేవలందించారు. వరద ప్రభావానికి గురైన 6791 కుటుంబాలకు ప్రభుత్వం సరఫరా చేసిన ఆహారం, సహాయక సామగ్రిని అందజేశారు. లంక గ్రామాల పరిధిలోని బాధితులను ఆదుకునేందుకు ప్రాణాలకు తెగించి మరీ పడవలపై వెళ్లి సేవలందించడం గమనార్హం. వరదల సమయంలో ఆరోగ్య పరిస్థితి బాగోనివారికి వైద్య సహాయం అందించడంలో వలంటీర్ల పాత్ర ఎనలేనిది. ప్రజలకు స్వచ్ఛందంగా సేవలందిస్తున్న వలంటీర్లపై రాజకీయ నేతలు చేస్తున్న ఆరోపణలు బాధాకరమని ఆయా ప్రాంతాల ప్రజలు పేర్కొంటున్నారు.



కుక్కునూరులో సేవలందిస్తున్న వలంటీర్ (ఫైల్)



యలమంచిలి మండలం పెదలంకలో వరద నీటిలో ఆహారం పంపిణీ చేస్తున్న వలంటీర్లు (ఫైల్)

వలంటీర్ల సేవలు ఎనలేనివి



"వరద నీరు మా గ్రామాన్ని, మా ఇంటిని చుట్టుముట్టిన సమయంలో మాకు ఏంచేయాలో పాలుపోలేదు. తాగునీరు, ఆహారం కోసం ఇబ్బందులు పడకుండా అధికారులు, వలంటీర్లు అందించిన సేవలు ఎన్నటికీ మరిచిపోలేం. వారి సేవలకు కృతజ్ఞతలు.

– షేక్ చాందిని, కుక్కునూరు

ఆపద్బాంధవుల్లా ఆదుకున్నారు...



గతేడాది గోదావరి వరద ఎన్నడూ లేని స్థాయిలో మా గ్రామాన్ని ముంచేసింది. దీంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం అందించిన ఆహారం, సహాయ సామగ్రిని వలంటీర్లు అందించి చేసిన సాయం మరువలేనిది. అంత కష్టకాలంలో వారు అందించిన సేవలు చూసి ఆ దేవుడే మమ్మల్ని ఆదుకోవడానికి పంపించాడని అనిపించింది.

– హసీనా, కుక్కునూరు

త్రోబాల్ జట్టు ఎంపిక



పోటీలకు ఎంపికైన త్రోబాల్ జట్టు

తాడేపల్లిగూడెం: విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో ఈ నెల 16న జరుగనున్న త్రోబాల్ సబ్ జూనియర్ స్టేట్‌మీట్‌లో పాల్గొనే జట్టును శుక్రవారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎంపిక చేశారు. విజయవాడ పోటీల్లో విజేతలైన వారు ఆగస్టు 4, 5, 6 తేదీల్లో పుదుచ్చేరిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు వెళ్తారని వెస్టుగోదావరి త్రోబాల్ అసోసియేషన్ ప్రెసిడెంటు సీహెచ్ఏఆర్‌కె.వర్మ, జనరల్ సెక్రటరీ ఎస్.ఎం.శ్రీనాథ్‌లు తెలిపారు. బాలుర జట్టులో కె.కశ్యప్, ఎస్.తేజ, కె.భాస్కర్, బి.మనోజ్, ఎస్.అర్పిత్, ప్రతీక్, పి.జయపాల్, కె.యశ్, భగవాన్, డి.భువనేష్ , బి.రుద్ర, బాలికల జట్టులో కె.ప్రణవి, డి.ముగ్ధ, డి.ధర్విక్, బి.అలేఖ్య, వై.చైత్ర, పి.శ్రీవల్లి, ఎస్.శ్రీజా, ఆర్.గాయత్రి, జి.గాయత్రీ, ఎం.భాగ్యలక్ష్మి, కె.వనిత, ఎస్.సలోని, ఎం.లక్ష్మీ మంజూషలు ఉన్నారు.

సెంట్రల్ జోన్ క్రికెట్ రన్నరప్‌గా పశ్చిమ గోదావరి

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) అంతర జిల్లాల సీనియర్ పురుషుల మల్టీడే క్రికెట్ మ్యాచ్ విజేతగా గుంటూరు నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు ఏసీఏ(సీపీ, డీవీఆర్) మైదానంలో ఆరు ఇన్నింగ్స్‌లలో జరిగిన ఈ మ్యాచ్‌లలో ఉమ్మడి గుంటూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం జిల్లాల జట్లు తలపడ్డాయి. అత్యధికంగా 13 పాయింట్లతో గుంటూరు ప్రథమ స్థానంలో నిలవగా తొమ్మిది పాయింట్లతో పశ్చిమగోదావరి రెండో స్థానంలో, ఆరు పాయింట్లతో కృష్ణా మూడో స్థానంలో, రెండు పాయింట్లతో ప్రకాశం నాల్గో స్థానంలో నిలిచాయి.

10 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



రెవెన్యూ, పౌర సరఫరాల అధికారుల దాడుల్లో పట్టుబడ్డ బియ్యంతో అధికారులు

చింతలపూడి: చింతలపూడి మండలం పోతునూరులో ఒక రైస్ మిల్లుపై రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 10 టన్నుల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు పౌర సరఫరాల శాఖ డీటీ జరీనా శుక్రవారం తెలిపారు. మిల్లును లీజుకు తీసుకుని నడుపుతున్న పుల్ల మూర్తి విచారణ సమయంలో మిల్లులో ఉన్న బియ్యం నిల్వలకు సరైన బిల్లులు చూపలేదని.. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని యజమానిపై కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

పోలవరం రూరల్: పోలవరం వైద్యశాలలో చికిత్స పొందుతూ విద్యార్థి మృతిచెందాడు. పోలవరం మండలం చేగొండిపల్లి గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఈసం మహేంద్ర జ్వరంతో బాధపడుతుండగా, గురువారం పాఠశాలలో ప్రాథమిక చికిత్స అందించారు. కుటుంబసభ్యులు మధ్యాహ్నం విద్యార్థిని ఇంటికి తీసుకువెళ్లారు. రాత్రి సమయంలో జ్వరతీవ్రత ఎక్కువ కావడంతో పోలవరం వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున విద్యార్థి మృతిచెందాడు. బాలుడి కుటుంబసభ్యులను పీడీఎస్‌యు సభ్యులు పరామర్శించారు.

ట్రిపుల్ మర్డర్ కేసు కొట్టివేత

విజయవాడ స్పోర్ట్స్: కృష్ణాజిల్లా పెదఅవుటపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై తొమ్మిదేళ్ల క్రితం జరిగిన ట్రిపుల్ మర్డర్ కేసులో పోలీసులు సరైన సాక్ష్యాధారాలు సమర్పించకపోవడంతో విజయవాడ ఏడవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం శుక్రవారం కేసును కొట్టివేసింది. ముంబై నుంచి విమానంలో గన్నవరం చేరుకుని కారులో ఏలూరు వైపు వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను కిరాయి హంతకులు తుపాకీతో కాల్చారు. 2014 నవంబర్ 24వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగిన ఈ ఘటనతో గంధం నాగేశ్వరరావుతో పాటు అతని కుమారులు గంధం మారయ్య, గంధం పగిడి మారయ్య అక్కడికక్కడే మృతి చెందారు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ దారుణ హత్య జరిగినట్లు అప్పట్లో పోలీసులు గుర్తించి ఉంగుటూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన 36 మందితో పాటు ఢిల్లీకి చెందిన 13 మందిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులకు సుపారీ ఇచ్చి ఈ హత్య చేయించారని అప్పట్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. ఈ కేసులో సరైన ఆధారాలు, సాక్ష్యాలను న్యాయస్థానానికి పోలీసులు సమర్పించకపోవడంతో కేసును కొట్టివేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.

సమీకృత విధానంలో రైతులకు మేలు



తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం ఉద్యానవర్సిటీలో పశుగ్రాస వారోత్సవాల దృశ్యం

తాడేపల్లిగూడెం/తాడేపల్లిగూడెం రూరల్: వ్యవసాయం, ఉద్యానం, పాడి, ఇలా వివిధ రకాల కార్యకలాపాలు సమీకృతం చేయడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, గేదెల పరిశోధన స్థానం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ జానకీరామ్ మాట్లాడుతూ రాష్ట్రం ఉద్యాన హబ్‌గా ప్రసిద్ధి చెందిందన్నారు. కూరగాయలు, పండ్ల ఉత్పత్తిలో రాష్ట్రం రెండో స్థానంలో ఉందన్నారు. అన్నదాత ఆర్థికాభివృద్ధికి సమగ్ర వ్యవసాయ విధానం అవసరమని పేర్కొన్నారు. హార్టీకల్చర్‌లో లైవ్ స్టాక్ ఒక భాగంగా తీసుకుంటే రైతులు అధిక లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని రైతు హిత, పర్యావరణహిత, స్థిరత్వంతో కూడిన మేలు రకం పశుగ్రాసం ఉత్పత్తి చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 75 శాతం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు సరఫరా చేస్తున్నారన్నారు. అనంతరం వివిధ రకాల పశుగ్రాసాలను ప్రదర్శించారు. గేదెల పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ఆనందరావు మాట్లాడారు. అనంతరం ఉత్తమ పాడి రైతులను సన్మానించారు. రైతులకు పశుగ్రాసం కణుపులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, ఉద్యాన వర్సిటీ విస్తరణ సంచాలకురాలు డాక్టర్ ఈ.కరుణశ్రీ, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు విజయభాస్కర్, పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతి, గూడెం వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, దర్శిపర్రు సొసైటీ చైర్మన్ గుండుమోగుల సాంబయ్య, తాడేపల్లిగూడెం, పెంటపాడు వ్యవసాయ సలహా మండలి చైర్మన్లు ముప్పిడి పెద్దబ్బులు రెడ్డి, కట్టుబోయిన కృష్ణ ప్రసాద్, వెంకట్రామన్నగూడెం సర్పంచ్ పోలిమోను నాగ అంజూష, పాడి రైతులు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం



పాలకోడేరు : విస్సాకోడేరులో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహ రాజు

హాస్టల్ విద్యార్థిని గాయపర్చిన వంటమనిషి



కాళ్ల ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో విచారణ చేస్తున్న దృశ్యం

కాళ్ల: కాళ్ల ఎస్సీ బాలుర హాస్టల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని హాస్టల్ వంటమనిషి కొట్టిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు సత్య సుధామ శుక్రవారం క్షేత్రస్థాయి విచారణ చేశారు. రాజమండ్రికి చెందిన కొవ్వాకుల తేజ సుమారు 20 రోజుల క్రితం కాళ్ళ ఎస్సీ బాలుర హాస్టల్లో చేరాడు. ఈనెల 12న హాస్టల్ విద్యార్థి స్కూల్ మానేయడంతో కుక్ వెంకటేశ్వరరావు విచక్షణ రహితంగా కొట్టి గాయపరిచాడు. అనంతరం ఒక గదిలో బంధించాడు. విద్యార్థులు స్కూల్ నుంచి వచ్చి తేజను గది తలుపు తీసి బయటకు తీసుకొచ్చి ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. తేజ తల్లిదండ్రులు వచ్చి విద్యార్థి చదువుతున్న స్కూల్ కి వెళ్లి దరఖాస్తు చేసి రాజమండ్రి తీసుకువెళ్లారు. ఈ నెల 12న హాస్టల్ వార్డెన్ శ్రీధర్ వీక్లీ ఆఫ్ ఉండడం వల్ల విషయం బయటకు రాలేదు. ఈ విషయాన్ని సత్య సుధామ జిల్లెళ్ళ దృష్టికి తల్లిదండ్రులు తీసుకువెళ్లారు. ఆమె మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ డీడీని కలిసి విషయాన్ని చర్చించడానికి వెళ్లగా అందుబాటు లేరన్నారు. నిజమా కాదా అని నిర్ధారణ కోసం కాళ్ల ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం సందర్శించామన్నారు. హాస్టల్ వార్డెన్ ఇదంతా నిజమేనని చెప్పారు. విద్యార్థులను కూడా విచారించారు. ఇంతవరకు అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

అమ్మతనానికి మాయని మచ్చ

- రెండో భర్తతో సహజీవనానికి కుమార్తెలపై ఒత్తిడి
- నిందితుల్ని అరెస్ట్ చేసిన దిశ పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పెదపాడు మండలంలో సభ్యసమాజం సిగ్గుపడేలా.. అమ్మతనానికి మాయని మచ్చతెచ్చేలా ఒక 'కసాయి' తల్లి నిర్వాకం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అత్యంత పాశవికమైన రీతిలో కన్నతల్లి బంధానికే అర్థాన్ని మార్చివేస్తూ మహిళ చేసిన ఘోరంపై సమాజం తలదించుకుంటోంది. తన రెండో భర్త మగపిల్లాడు కావాలని ఒత్తిడి చేయటంతో ఏకంగా తన ఇద్దరు కూతుళ్లను అతనితో సహజీవనం చేయాలని ఒత్తిడి చేసింది. ఆ మహిళతో పాటు నీచమైన వ్యక్తిత్వంతో వావివరుసలు మరిచిపోయిన రెండో భర్తను ఏలూరు దిశ పోలీసులు అరెస్ట్‌చేశారు.

ఏలూరు జిల్లా పెదపాడు మండలంలో ఈ ఘోరమైన సంఘటన వెలుగు చూసింది. విశాఖపట్నంకు చెందిన మహిళకు(37) 2004లో వివాహమైంది. భర్త 2007లో అనారోగ్యంతో మృతిచెందాడు. అనంతరం ఆమె సొంత మేనమామ కొడుకుని(42)ను 2010లో వివాహం చేసుకుంది. అతను కార్ డ్రైవింగ్ చేసుకుంటూ ఏలూరు శివారు, పెదపాడు మండలంలోని ఒక ప్రాంతంలో ఉంటున్నాడు. ఆ మహిళకు మొదటి భర్తతో ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిద్దరూ ఆమె వద్దే ఉంటున్నారు. తనకు పిల్లలు కావాలని ఆమెపై రెండో భర్త ఒత్తిడి చేస్తున్నాడు. ఇద్దరు పిల్లల అనంతరం ఆ మహిళ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంది. తనకు పిల్లలు పుట్టరని చెప్పినా తీవ్రమైన ఒత్తిడి చేసేవాడు. పిల్లలు లేకపోతే ఆమెతో ఉండనని బెదిరించాడు. ఆ మహిళ సమస్యను, పరిస్థితిని ఆసరాగా చేసుకున్న రెండో భర్త ఇద్దరు ఆడపిల్లలపై కన్నేశాడు. ఆ తల్లి తన సొంత బిడ్డలని మరిచిపోయి వారిని రెండో భర్తకు అప్పగించింది. మొదటి కుమార్తెతో సహజీవనం చేయగా ఆడపిల్ల పుట్టింది. సంతృప్తి చెందకుండా మగపిల్లాడు కావాలనే నెపంతో చిన్న కుమార్తెతో మరో బిడ్డను కన్నాడు. మగబిడ్డ పుట్టి చనిపోయింది. ఈ నేపథ్యంలో ఆమెకు, రెండో భర్తకు మధ్య వివాదం ఏర్పడింది. ఆమె తల్లిదండ్రుల ఇంటికి వెళ్ళటంతో అక్కడ కుమార్తెలు తమకు జరిగిన ఘోరాన్ని బంధువులకు చెప్పారు. బంధువులు ఏలూరు దిశ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో దిశ పోలీస్‌స్టేషన్ సీఐ ఇంద్ర శ్రీనివాస్ రంగంలోకి దిగారు. నిందితులిద్దరినీ శుక్రవారం అరెస్ట్ చేశారు.

కత్తిపోట్ల ఘటనలో నలుగురి అరెస్ట్

సాక్షి, భీమవరం: భీమవరం వన్‌టౌన్‌లో కత్తిపోట్ల ఘటనలో వ్యక్తి మృతి చెందిన కేసుకు సంబంధించి నలుగురిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను తెలిపారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. భీమవరం 18వ వార్డులోని ఓ ఇంట్లో షేక్ మెహబూబానీ, అతని భార్య దిల్షాద్, అతని మూడో కుమారుడు కరీముల్లాతోపాటు భార్య అఫీరా, ఆఖరి కుమారుడు షేక్ రహీం ఉంటున్నారు. ఏలూరు గన్ బజారుకు చెందిన పఠాన్ షంషేర్ ఖాన్ రెండోభార్య అయిన షకీలా 20 రోజులుగా ఆచూకీ లేదు. ఆమె భీమవరంలో ఉంటున్న కుమార్తె ఆఫీరా ఇంటికి వెళ్లిందనుకున్నారు. షంషేర్‌ఖాన్ మొదటి భార్య కుమార్తె అయిన యాసిన్‌ను ఆఫీరా ఇంటికి పంపించి వివరాలు అడిగి రమ్మన్నారు. షకీలా రాలేదని ఆఫీరా చెప్పడంతో వెనుదిరిగారు. ఆమె అదే ఇంట్లో ఉండొచ్చనే అనుమానంతో తల్లిని దాచిన అఫీరాను చంపాలనే ఉద్దేశంతో ఇంట్లోకి చొరబడే యత్నంలో పఠాన్ షంషేర్ ఖాన్ వెంట తెచ్చుకున్న చాకుతో అడ్డువచ్చిన షేక్ మహబూబ్ జానీని, అతని కుమారుడు రహీం, మరో కుమారుడైన కరీముల్లా భార్య అఫీరాపై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన మెహబూబ్ జానీ విజయవాడలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ముద్దాయిలను పట్టుకునేందుకు ఎస్పీ రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులైన పఠాన్ షంషేర్ ఖాన్, భీమవరం 18వ వార్డుకు చెందిన మహ్మద్ ముజీబ్, యాసిన్, దెందులూరు సీతంపేటకు చెందిన పఠాన్ అఫ్రోజ్‌లను డీఎస్పీ బి. శ్రీనాథ్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు.

క్లుప్తంగా

సమృద్ధిగా ఎరువులు



తాడేపల్లిగూడెం మండలంలోని వరి నాట్లను పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని, ముందస్తుగా రైతులు కొనుగోలు చేయవద్దని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వరి నాట్లు, వరి పొలాలను ఆయన పరిలలించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ నాట్లు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాట్లు వేసిన 40 రోజుల లోపు కాంప్లెక్స్ ఎరువులు వేసుకోవాలని సూచించారు. యూరియా అధికంగా వాడవద్దన్నారు. ఆయన వెంట ర్యాలీ సూర్య, చినసత్యనారాయణ, బుర్రె నాగేశ్వరరావు, చేదూరి పాండు, ఏఈవో వర్మ, వీహెచ్ఏలు దుర్గ, ప్రవీణ్ ఉన్నారు.

చిల్డ్రన్ హోంకు బియ్యం అందజేత



చిన్నారులకు అల్పాహారం, బియ్యం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని కొండయ్య చెరువు సమీపంలోని లార్డ్ ఆఫ్ లివింగ్ చిల్డ్రన్స్ హోమ్‌లోని అనాథ పిల్లలకు శుక్రవారం లయన్ కోనా కళ్యాణి సౌజన్యంతో వశిష్ట లియో క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం, 25కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దాతలు సహృదయంతో ఆశ్రమాలకు ఇతోధిక సాయం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ ఆకాశం సాయిశృతి, కుందుం వెంకటేశ్వరరావు, మోటూరి వెంకటరత్నం, యర్రా ఆంజనేయస్వామి, మాధురి, దర్గావెంకట సాయిలక్ష్మి, విజదుర్గా అంబికా శిరీషా తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు దిశ ప్రొటెక్షన్



దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మహిళల భద్రతకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారని దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ రాష్ట్ర కోశాధికారి కొల్లా విజయలక్ష్మి కుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రావుపాలెం గ్రామంలో కొత్తగా చేరిన సభ్యులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి కుమారి మాట్లాడుతూ దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసి, మహిళలకు సత్వర న్యాయం చేస్తున్నారన్నారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో 14.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 15.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ శుక్రవారం తెలిపారు. పెంటపాడు మండలంలో 9.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

ఉండి: ఆరేడులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన భీమాపుడి యామి, సనేష్‌కుమార్ మృతి చెందగా, మృతదేహాలకు శుక్రవారం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై కే గంగాధరరావు చెప్పారు. గురువారమే ప్రమాద విషయాన్ని బంధువులకు తెలియచేయడంతో ఇరు కుటుంబాలకు చెందిన బంధువులు, కుటుంబ సభ్యులు, ఆయా గ్రామ పెద్దలు భీమవరం ప్రభుత్వాసుపత్రికి రావడంతో పోస్టుమార్టం అనంతరం వారికి మృతదేహాలను అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

'ఎస్ఆర్‌కేఆర్'కు 3వ ర్యాంక్

సాక్షి, భీమవరం: ప్రతిష్టాకరమైన టైమ్స్ గ్రూప్ రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలలపై నిర్వహించిన ర్యాంకింగ్ సర్వే 2023లో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు మూడో ర్యాంక్ లభించిందని కళాశాల సెక్రటరీ సాగి రామకృష్ణనిశాంత్‌వర్మ చెప్పారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు, కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిషాంతవర్మకు అభినందనలు తెలిపారు. కెరీర్ 360 సంస్థ కూడా నిర్వహించిన సర్వేలో తమ కళాశాలకు ట్రిపుల్ ఎ ప్లస్ ర్యాంక్ ప్రకటించిందన్నారు. కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు రామరాజు పాల్గొన్నారు.

సదా మీ సేవలో..



ఒకటో తేదీనే ఇంటికెళ్లి పింఛన్ ఇచ్చి అవ్వాతాతల ముఖాల్లో ఆనందం నింపేది వలంటీర్లే. సంక్షేమమ పథకాలకు అర్హులను గుర్తించి దరఖాస్తు చేయించేదీ వారే...కరోనా కష్ట సమయంలోనూ మేమున్నామంటూ భరోసా ఇచ్చి సేవలతో మురిపించిందీ ఆసేవా సారథులే. గూడు లేని పేదలను గుర్తించి ప్రభుత్వ స్థలాలు అందించేందుకు సహకరించిన సంక్షేమ వారధులు వీరే...ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఈవ్యవస్థ ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలిచింది. ఆచరణ యోగ్యంగా మారింది. సామాన్యులకు సేవకుల్లా..అర్హులకు ప్రభుత్వ పథకాలు దరిచేరేలా వారు అందిస్తున్న సహకారం ఎనలేనిది. అలాంటి వలంటీర్లు అందిస్తున్న సేవలు తెలుసుకుందాం రండి.

– తణుకు అర్బన్, తాడేపల్లిగూడెం అర్బన్

అండగా నిలిచింది



తణుకుకు చెందిన ఈమె పేరు మానేపల్లి దుర్గ. సజ్జాపురంలో నివసిస్తున్న ఈమెకు ప్రభుత్వం అందిస్తున్న అమ్మ ఒడి పథకం అందుతుంది. ప్రభుత్వం నుంచి ఎటువంటి సౌకర్యం ఉన్నా వలంటీరు ఆకుల రమ్య శిరీష విశేషంగా సేవలందిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి ఏ పథకానికైనా అర్హురాలినేమోనని ముందుగానే ఇంటిగుమ్మంలోకి వచ్చి ఆరా తీసే మంచి వలంటీరు మాకు ఉందని చెబుతున్నారు.

– మానేపల్లి దుర్గ, తణుకు.

వలంటీర్ వ్యవస్థ అద్భుతం



వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడం అద్భుతంగా ఉంది. గతంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వాళ్ళం కాని ఇప్పుడు ఇంటికే వచ్చి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఇస్తున్నారు. నెలాఖరు రోజునే పింఛన్లు ఇచ్చేందుకు వలంటీర్లు సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మొదటి తారీఖునే మా వలంటీరు వెంకటలక్ష్మి నాకు పింఛన్ ఇస్తుంది.

– కిల్లాడి సూర్యలక్ష్మి, 14వవార్డు

బంధువులా బాగోగులు



మా వలంటీరు వెంకటలక్ష్మి ప్రతీ రోజు వచ్చి నన్ను పలకరించి ఎలా ఉన్నావని అడుగుతుంది. కరోనా సమయంలో వారు చేసిన సేవలను మర్చిపోలేము. ఫోన్ ద్వారా మా అవసరాలను తెలియజేయగానే వెంటనే మాకు సరుకులు అందించేవారు. కరోనాకు భయపడి ప్రజలు ఇళ్లలోనే ఉంటే వలంటీర్లు భయపడకుండా వార్డుల్లో తిరిగి ప్రజలకు సేవలందించారు. వారి సేవలను మర్చిపోలేము.

– బొబ్బిలి రామస్వామి, 14వవార్డు

కుటుంబ సభ్యుడిలా...



వలంటీర్లు అందస్తున్న సేవలకు వారిని మేము మర్చిపోలేము. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను చెప్పి ఏ పథకానికి దరఖాస్తు చేసుకుంటారని అడుగుతుంది. ఇటీవల ధ్రువపత్రాలను అందించేందుకు ఏర్పాటు చేసిన జగన్న సురక్ష కార్యక్రమం గురించి వివరించింది. నేను ఇన్‌కం సర్టిఫికెట్టు కావాలని మా వలంటీర్ వెంకటలక్ష్మిని అడిగాను. వెంటనే దరఖాస్తు చేసి సర్టిఫికెట్టును ఇచ్చారు.

– సంజీవి కరుణ, దివ్యాంగురాలు

- పథకాల అమలులో వలంటీర్లు కీలకం
- ప్రతి ఇంటికి చేరిన సంక్షేమం

వలంటీరు సేవలు భేష్..



నా పేరు నక్కా వీర వెంకటరమణ. దివ్యాంగుడు కావడంతో ప్రభుత్వం నుంచి ప్రత్యేక పింఛన్‌గా రూ.5వేలు అందుతుంది. నేను ఇప్పటికీ తల్లి సంరక్షణలోనే ఉన్నారు. గతంలో పింఛన్ కోసం లైన్‌లో నిలబడాల్సి వచ్చేదని ఇప్పుడు వలంటీరు వ్యవస్థ వచ్చినప్పటి నుంచి వలంటీరు వంశీకృష్ణ తెల్లవారుజామునే వచ్చి పింఛన్ అందిస్తున్నారు. ఏ అవసరం వచ్చినా నేనున్నానని ముందుంటారన్నారు.

– నక్కా వీరవెంకట రమణ, తణుకు.

సొంతబిడ్డలా...



తణుకుకు చెందిన ఈమె పేరు వంశెట్టి పెద్దింట్లు. చాలా ఏళ్ల క్రితమే భర్త చనిపోవడంతో కుమార్తెకు వివాహం చేసి ఒంటరిగా ఉంటున్నారు. తణుకు సజ్జాపురంలో ఒంటరిగా నివసిస్తున్న ఈమెకు వలంటీరు బొబ్బిలి భవాని సేవలందిస్తున్నారని చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి పింఛన్ వస్తుండగా కాపు నేస్తం డబ్బులు వస్తున్నాయి. వలంటీరు సొంత బిడ్డలా సేవ చేస్తున్నట్లు వివరిస్తున్నారు.

– వంశెట్టి పెద్దింట్లు, తణుకు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



స్థానికులకు పారిశుధ్య సామాగ్రిని అందజేస్తున్న మలేరియా సబ్‌యూనిట్ సభ్యులు

తాడేపల్లిగూడెం అర్బన్ : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి లక్ష్మణరావు సూచనలు చేశారు. డెంగ్యూ నివారణ కార్యక్రమంలో భాగంగా 10, 12, 33, 34, 35 వార్డుల్లో ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహింరు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడతూ డెంగ్యూ నివారణ మహోత్సవాలలో భాగంగా ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని ఆయా వార్డుల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా గృహాల నుంచి వచ్చిన చెత్తను వేసుకొనేందుకు స్థానికులకు ప్లాస్టిక్ టబ్‌లను పంపిణీ చేశారు. దీనితోపాటు పైలేరియా వ్యాధి గ్రస్తులకు ఉపశమన వస్తు సామాగ్రిని అందచేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కె నర్సింహ లక్ష్మీనాయుడు, కార్యదర్శులు బేబి, లూర్ద్, మేరీజ్యోతి, రాజేశ్వరి చినపాప, సచివాలయం శానిటేషన్ కార్యదర్శులు, ఆశావర్కర్లు, వలంటీర్లు, ఆరోగ్య సహాయకులు కాంతారావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో సంతోషంగా ప్రజలు

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- రామన్నగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం



తాడేపల్లిగూడెం మండలం రామన్నగూడెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం రామన్నగూడెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 750 ఇళ్లకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ అధికారంలోకి రావడానికి పార్టీ పెట్టారో...చంద్రబాబును పైకి తీసుకురావడానికి పార్టీ పెట్టారో అర్థం కావడం లేదన్నారు. వ్యవస్థలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన మార్పులపై పవన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. పవన్ అవగాహన లేని మాటలు తిరోగమనం దిశగా ఉన్నాయన్నారు. రాజకీయ నాయకునిగా ఎదుటి వారిని గౌరవించేలా పవన్ మాటలు లేవన్నారు. సినిమాల్లో తన ఖ్యాతిని దిగజార్చుకునేలా జగన్‌పై అభాండాలు వేస్తున్నారని విమర్శించారు. ఇదిలా ఉంటే గ్రామంలోని డ్రెయినేజీ సమస్యను ప్రజలు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సమస్యపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతా వెంకట్రావు, ఎమ్పీటీసీలు దూలపల్లి సత్తియ్య, మార్లపూడి సుబ్బారావు, చినతాడేపల్లి సర్పంచ్ పిచ్చికల రాజారావు, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, పరిమి తులసీదాస్, యూత్ అధ్యక్షుడు ములకాల రాంబాబు, సచివాలయ కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు కొడవటి వేణు అరవింద్, కె.రవిచంద్ర, బి.ఫణికుమార్, టి.పవన్‌కుమార్, హౌసింగ్ ఏఈ వైవీ.వెంకట్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, పెదతాడేపల్లి శివాలయం కమిటి చైర్మన్ ఆలపాటి కాశీవిశ్వనాథం, కారింకి వీర్రాజు, బొద్దాని శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం రద్దు చేయండి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్ : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిర్వహిస్తున్న విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర శుక్రవారం తాడేపల్లిగూడెం చేరుకొంది. పట్టణంలోని పలుహాస్టళ్లను పరిశీలించారు. బీసీ వసతిగృహంలోని బాలికలతో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్ పావని విద్యార్థినులతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. హాస్టల్ భవనంలోని శ్లాబునుంచి సిమెంట్ పెచ్చులూడి కిందపడుతున్నాయని తెలిపారు. పావని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ప్రచారంపై ఉన్న శ్రద్ధ విద్యాలయాలపై లేదన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో హాస్టళ్లకు సొంతభవనాలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు టి రవిబాబు, పి నాగేంద్ర, ఎండీ జాన్,సింధు, శ్రీను, చిరంజీవి, ఈశ్వర్, శ్రీకాంత్, సాయిలాల్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 113 మందికి ఉద్యోగాలు



దుంపగడప జాబ్ మేళాలో ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న యువకులు

ఆకివీడు: దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 113 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు లభించాయి. జాబ్‌మేళాకు వివిధ ప్రాంతాల నుంచి 300 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 13 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించగా 113 మంది అభ్యర్థులు విజయం సాధించారు. వారికి నియామక పత్రాల్ని అందజేశారు. తొలుత మెగా జాబ్ మేళా ప్రారంభోత్సవ సభ కళాశాల ఆవరణలోని బీ.స్వరాజ్యలక్ష్మీ సెమినార్ హాల్‌లో జరిగింది. సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరగుతున్నజాబ్ మేళా కార్యక్రమాలు నిరుద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. కళాశాల ఆవరణలో నిర్వహించిన రెండవ మెగాజాబ్‌మేళాతో సుమారు 300 మందికి ఉద్యోగ అవకాశాలు కల్గినట్లు చెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగులు ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా విద్యా బోధనతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే ఎం.రామరాజు, ప్రిన్సిపాల్ కే. సుజాత, నైపుణ్యాభివృద్ధిసంస్థ జిల్లా అధికారి ఏ. కృష్ణారెడ్డి, కళాశాల సీపీడీసీ కార్యదర్శి డాక్టర్ పీబీ.ప్రతాప్ కుమార్, కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఎస్‌వీ.రామరాజు పాల్గొన్నారు.

నూరుశాతం 'మధ్యాహ్న' భోజనం చేయాలి



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న కృష్ణారావు

సాక్షి, భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు విద్యతో పాటు పోషకాలతో కూడిన భోజనం అందించేందుకు ప్రాధాన్యం ఇస్తోందని మధ్యాహ్న భోజనం, పాఠశాల పారిశుద్ధ్య ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ కె.కృష్ణారావు అన్నారు. పట్టణంలోని దుర్గాపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, డాక్టర్ బీఆర్ రాజు మున్సిపల్ హైస్కూళ్లను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. స్కూళ్లలో ఆహార పదార్థాల నాణ్యత, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులకు వారంలో ఐదు రోజులు కోడిగుడ్లు, మూడు రోజులు రాగి జావా, చిక్కీలతోపాటు తీపి పొంగలి, పులిహోర, పోషక విలువలు గల ఆకుకూరలు, కూరగాయల బిర్యానీ వంటి వంటకాలను విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. పాఠశాలల్లోని విద్యార్థులు నూరుశాతం మధ్యాహ్న భోజనం చేసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హెచ్ఎంలు షేక్ బాబాజీసాహెబ్, వి.విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆషాఢ సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): మెంటేవారితోటలో వేంచేసియున్న బాలత్రిపుర సుందరిదేవి అమ్మవారికి భక్తులు శుక్రవారం ఆషాఢ మాస సారె సమర్పించారు. అలాగే ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణానికి చెందిన తోట కృష్ణ, లక్ష్మీ దంపతులు అమ్మవారికి సుమారు 55 రకాల స్వీట్స్, పండ్లు, చీర, గాజులు, పసుపు, కుంకుమ తదితర వాటిత అమ్మవారికి ఆషాడమాస సారే సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆకివీడులో నూకాలమ్మకు..

ఆకివీడు: స్థానిక శాంతినగర్‌లో వేంచేసియున్న నూకాలమ్మ అమ్మవారికి మహిళలు ఆషాఢ మాస సారెను శుక్రవారం సమర్పించారు. వివిధ రకాల పిండి వంటలు, స్వీట్లతో మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంతి ప్రధానోపాధ్యాయురాలు కాకర్ల రాజ రాజేశ్వరి మాట్లాడుతూ ఆషాఢ మాస విశిష్టతను, అమ్మవార్ల అనుగ్రహాన్ని వివరించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 630 మందికి పరీక్షలు



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజు ప్రారంభించారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు పుట్టినరోజు సందర్భంగా ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ వైద్య శిబిరంలో 630 మందికి పరీక్షలు చేసినట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌జే సోమరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆకివీడు: గోకరాజు గంగరాజు పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఆకివీడులో అనాథాశ్రమం, బాలసదన్‌లో, పేదలకు అన్నదానం చేశారు. నేరెళ్ల పెదబాబు, కట్రెడ్డి ఏడుకొండలు పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవార్లు



పెనుగొండలో శాకంబరి దేవిగా దర్శనం ఇచ్చిన వాసవీ మాత



కూరగాయలతో శాకంబరీదేవి అలంకరణలో దుర్గమ్మ

పెనుగొండ: ఆషాఢమాసం సందర్భంగా పెనుగొండలో శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత, మహిషాసురమర్ధనీ అమ్మవార్లు శాకంబరీ దేవిగా దర్శనం ఇచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలో, వాసవీ శాంతి ధాంలో అభిషేకాలు, అర్చనలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కూరగాయలతో అమ్మవార్లను అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు.

శాకంబరి అలంకరణలో దుర్గమ్మ

నరసాపురం రూరల్: నరసాపురంలోని రాయపేటలోని కనకదుర్గమ్మవారిని శుక్రవారం శాకంబరీ దేవిగా అలంకరించారు. కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీసలిలో ఇళ్ల పట్టాల పంపిణీ



సీసలిలో పట్టాల పంపిణీ చేస్తున్న పీవీఎల్

కాళ్ల: అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. సీసలిలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పీవీఎల్ చేతుల మీదుగా అందజేశారు. కోలనపల్లిలో సీసలి గ్రామానికి చెందిన 100 మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారు. అయితే కోర్టులో క్లియరెన్స్ రావడంతో పట్టాల పంపిణీ చేశారు. ముందుగా 15 మందికి పట్టా ఇవ్వగా మిగిలిన వారికి కూడా పట్టాలు పంపిణీ చేస్తారని మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బిళ్ళకుర్తి ధనలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, ఉప సర్పంచ్ బాతు మాణిక్యాలరావు, కట్రెడ్డి రామచంద్రరావు, గ్రామ పెద్దలు అధికారులు పాల్గొన్నారు.

నేడు జిల్లా సమావేశం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం చినరంగనిపాలెంలో గౌడ, శెట్టిబలిజ, శ్రీశైన, యాత, ఈడిగ జిల్లా సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు గౌడ, శెట్టి బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు వేండ్ర వేంకటస్వామి తెలిపారు. మధ్యాహ్నాం 2 గంటలకు ఈ సమావేశం ఉంటుందని గౌడ, శెట్టిబలిజ, శ్రీశైన, యాత, ఈడిగ ప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

'పీఎస్ఎం' విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు

సాక్షి, భీమవరం: పట్టణంలోని పొట్టిశ్రీరాములు మునిసిపల్ (పీఎస్ఎం) గరల్స్ హైస్కూల్లో టెన్త్ చదివిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని స్కూల్ ప్రధానోపాధ్యాయిని జె.సుధారాణి శుక్రవారం విలేకరులకు చెప్పారు. కె.కీర్తిశ్రీరంగశివాని, ఎ.నందిని, టి.మేఘన, టి.సాయిసత్యగీతిక (నూజివీడు), కె.కృష్ణప్రియదర్శిని (శ్రీకాకుళం) ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో సీట్లు పొందారన్నారు. అనంతరం విద్యార్థులను సుధారాణి, వారణాసి రాధాకృష్ణ తదితరులు అభినందించారు.

రూ.60 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని 32 వార్డులో సాయిబాబా గుడి రోడ్డు గోతులతో ఉండడంతో ఆప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వెంటనే రూ.60 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మించే పనులకు ఇటీవల శంకుస్థాపన చేశారు. గత రెండు రోజులుగా సీసీరోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సీసీరోడ్డు, డ్రెయిన్ నిర్మాణం చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మేలైన వ్యవసాయ పద్ధతులను పాటించాలి

నరసాపురం రూరల్: రైతులు మేలైన వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చునని ఏడీఏ ఈదా అనిల్‌కుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని తూర్పుతాళ్లు రైతు భరోసా కేంద్రంలో జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి వ్యవసాయ సలహామండలి కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతులకు సార్వా పంటకు సంబంధించి పాటించాల్సిన వ్యవసాయ పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా ఎడ్వయిజరీ బోర్డు చైర్మన్ కాండ్రేగుల నరశింహారావు, బోర్డు మెంబరు బండారు ఇస్సాకు, చిట్టవరం సర్పంచ్ తాడి లక్ష్మణరావు మాట్లాడుతూ తరచూ సార్వా పంట సమయంలో ముంపునకు కారణమవుతున్న కాలువల వివరాలు తెలిపారు. రైతుల సమస్యలను రికార్డులో నమోదు చేశారు.